

ముగిసిన నాటిక పోటీలు

కొంతేరులో పులపర్తి వీరాస్వామి యూత్‌క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక పోటీలు ముగిశాయి.

8లో



ఆధ్మాతిక చింతనతో ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు.

8లో



ముగ్గురి అరెస్టు

కోడిగుడ్ల లారీని అపహరించి డ్రైవర్‌ను హతమార్చిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

8లో

కల్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

- జిల్లాలో 828 మి.మీ వర్షపాతం నమోదు
- అత్యధికంగా కాళ్లలో 57.2 మి.మీ
- నేలనంటిన వరి చేలు
- కల్లాల్లోనే 70 వేల టన్నుల ధాన్యం
- 50 శాతం పూర్తయిన మాసూళ్లు





కాళ్ల మండలం దొడ్డనపూడి పరిధిలో నేలకొరిగిన వరి చేను, వీరవాసరంలో పొలంలో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న రైతు

సాక్షి, భీమవరం: అకాల వర్షం రైతులకు కష్టాలను తెచ్చిపెట్టింది. దాళ్వా వరికోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లావ్యాప్తంగా సోమవారం వేకువజాము నుంచి మూడు గంటల పాటు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేయగా ఇప్పటికే దాదాపు 50 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. భారీవరానికి ఈదురుగాలులు తోడవడంతో పంట నేలవాలింది. ఎక్కువగా ఎంటీయూ1121 రకం సాగు చేయగా దీనికి గింజరాలే గుణం తక్కువగా ఉన్నా పంట నేలవాలడం, ధాన్యం రాశులు తడవడంతో గింజలు రంగుమారే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

దాళ్వాపైనే ఆశలు

గత సార్వా సీజన్‌లో అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతులు దాళ్వా పంటపై గంపెడాశలు పెట్టుకున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు వ్యవసాయశాఖ సూచనలు పాటించడం, సాగునీరు, ఎరువులు ఇబ్బందులు లేకపోవడంతో దాళ్వా పైరు ఏపుగా పెరిగింది. బంగారు వర్ణంలో పంట చేతికి వచ్చే సమయంలో ఆకాశంలో మబ్బులు, మేఘాలు, చెదురుమదురు వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతూనే మాసూళ్లు చేపట్టారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లో ఎక్కువశాతం మాసూళ్లు పూర్తికాగా మిగిలినచోట్ల ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు లక్ష ఎకరాల్లో మాసూళ్లు పూర్తికాగా దాదాపు 70 వేల టన్నుల వరకు ధాన్యం కల్లాల్లోనే ఉన్నట్టు అంచనా. కోత యంత్రాలతో మాసూళ్లు చేయడంతో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టడం కోసం రైతులు ధాన్యాన్ని పొలాలు, రోడ్లు వెంబడి రాశులుగా వేశారు.

భారీ వర్షంతో పాట్లు

జిల్లాలో 828 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. భారీ వర్షంతో ధాన్యం తడవకుండా రైతులు బరకాలు కప్పి చర్యలు తీసుకున్నారు. అయితే రాశులు కింద నుంచి నీరుచేరే అవకాశం ఉండడంతో తడిసి మొక్కలు వచ్చే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు జిల్లాలో 4 సెం.మీ వర్షం

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. జిల్లాలోని 27 మండలాల్లో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 24 వేల ఎకరాల్లో వరి పంట కోతకు సిద్ధంగా ఉండగా పలుచోట్ల చేలు నేలవాలాయి. అలాగే కళ్లాల్లో ఉన్న 13 వేల టన్నుల ధాన్యానికి నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకూ భానుడి ప్రతాపానికి తీవ్రంగా వేడెక్కిన పుడమితల్లి కుండపోత వర్షానికి చల్లబడింది.

వర్షపాతం వివరాలు

మండలం	మిల్లీ మీటర్లు	మండలం	మిల్లీ మీటర్లు
		పాలకోడేరు	52.2
		ఇరగవరం	39.4
కాళ్ల	57.2	పెనుగొండ	48.2
పెనుమంట్ర	55.2	ఆచంట	31.2
వీరవాసరం	54.4	పోడూరు	45.8
తాడేపల్లిగూడెం	35.0	భీమవరం	44.8
పెంటపాడు	28.0	పాలకొల్లు	45.2
తణుకు	53.8	మొగల్తూరు	48.2
అత్తిలి	12.4	నరసాపురం	14.6
ఆకివీడు	45.2	యలమంచిలి	48.2
ఉండి	53.2	గణపవరం	16.4

మాసూళ్లు నిలిపివేయాలి



ఉపరితల ఆవర్తనంతో వర్షాలు కురుస్తున్నందున రైతులు నాలుగు రోజుల పాటు మాసూళ్లు నిలిపివేయాలి. ధాన్యం రాశులపై బరకాలు కప్పి జాగ్రతలు తీసుకున్నా అడుగుభాగంలో తడిచే ప్రమాదం ఉంది. తడిసిన ధాన్యం రంగు మారకుండా లీటరు నీటిలో 5 గ్రాముల ఉప్పును కలిపి ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఈదురుగాలులకు పడిపోయిన పంటను రెండు, మూడు దుబ్బులు కలిపి కట్టలుగా కట్టి నిలబెట్టాలి. ఎక్కువగా ఎంటీయూ 1121 రకం సాగు చేసినందున గింజరాలే గుణం ఎక్కువగా ఉండదు. జాగ్రత్తలు పాటించడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించవచ్చు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

రైతులను ఆదుకుంటాం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెంటపాడు: అకాల వర్షం వల్ల రైతులకు నష్టం లేకుండా తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ నిబంధనల మేరకు కృషిచేస్తానని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల పంట నష్టాలపై ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా గతంలో ధాన్యం కొనుగోలు చేసిన మాదిరిగా ఆదుకుంటామన్నారు. ఈ విషయంలో రైతులు దిగులు చెందవద్దని భరోసా ఇచ్చారు. కొనుగోలు నిబంధనల మేరకు జిల్లా అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అలాగే ధాన్యం కొనుగోలులో గోనె సంచుల కొరత రానివ్వకుండా చూస్తామన్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఇబ్బందులు లేవన్నారు. ఇప్పటికే 10 లక్షలకు పైగా గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

న్యూస్‌రీల్

పోలీసు స్పందనలో 13 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ యు.రవిప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ స్పందన కార్యక్రమంలో 13 ఫిర్యాదులు అందాయి. అత్తిలికి చెందిన ఓ మహిళ తన భర్త అత్తిలిలోని హోటల్‌లో పనిచేస్తుండగా యజమాని జీతం ఇవ్వకుండా వేధిస్తున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. భీమవరం టూటౌన్‌కు చెందిన ఓ మహిళ ఒక వ్యక్తి తనను మోసం చేసి రూ.8 లక్షలు తీసుకున్నాడని తనకు న్యాయం చేయాలని కోరింది. నరసాపురానికి చెందిన వ్యక్తి తనకు హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని మంగళగిరిబెటాలియన్‌కి చెందిన కానిస్టేబులు నమ్మించి రూ.8.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని వాపోయాడు. ఫిర్యాదులపై సత్వరమే విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా..

తొలిరోజు 88 శాతం పింఛన్ల పంపిణీ



ఇల్లపర్రులో జోరు వానలో పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

భీమవరం (ప్రకాశం చౌక్) : వైఎస్సార్ పెన్షన్ కానుక మొదటిరోజు సోమవారం జిల్లాలో 88 శాతం మేర పంపిణీ చేశారు. వేకువజాము నుంచి కుండపోత వర్షం కురుస్తున్నా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఏమాత్రం లెక్కచేయకుండా పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2.17 లక్షల మంది లబ్ధిదారులకు రూ.60 కోట్లు అందించాల్సి ఉండగా 1.86 లక్షల మందికి రూ.52 కోట్లు పంపిణీ చేశారు.

'విదేశీ విద్యా దీవెన'కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ఎస్.మధుసూదనరావు ఓ ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఈనెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 21 సబ్జెక్టుల్లో ప్రపంచంలోని టాప్ 50 విదేశీ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ అభ్యసించేందుకు సాయం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల వయసు 35 ఏళ్లలోపు ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించకూడదని, డిగ్రీ, పీజీ, ఇంటర్‌లో 60 శాతం మార్కులు, ఎంబీబీఎస్ కోర్సులు అయితే నీట్‌లో అర్హత సాధించాలని తెలిపారు. విద్యార్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో పొందుపర్చిన యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో మాత్రమే ప్రవేశం పొంది ఉండాలని పేర్కొన్నారు. పథకానికి ఎంపికైన ఎస్సీ, ఎస్సీ, బీసీ, కాపు, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25 కోట్లు, ఇతర విద్యార్థులకు రూ.కోటి వరకూ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన వివరించారు.

జీసీసీ ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు

బుట్టాయగూడెం: సహజ సిద్ధమైన ఉత్పత్తులను గిరిజన సహకార సంస్థ ద్వారా ప్రజలకు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. బుట్టాయగూడెంలో సుమారు రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన జీసీసీ సూపర్ బజార్, కాఫీ హౌస్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నిచోట్లా జీసీసీ ద్వారా నాణ్యమైన గిరిజన ఉత్పత్తులు ప్రజలకు అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా జీసీసీ సూపర్ మార్కెట్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. త్వరలోనే బుట్టాయగూడెం జీసీసీ సూపర్ మార్కెట్‌లో అటవీ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని, ముఖ్యంగా తేనె, కుంకుడు కాయలు, త్రిఫల చూర్ణం, త్రిఫల రసం వంటివి విక్రయిస్తారన్నారు. అనంతరం ముప్పినవారిగూడెంలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు.

దేశాభివృద్ధికి సాంకేతిక విద్య దోహదం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు : సాంకేతిక విద్య ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం నిట్ సమీపంలో రూ.7.65 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిపై ప్రత్యేక విజన్ ఉన్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. దేశ చరిత్రలో పాలనాపరమైన సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 14 ఏళ్ల కలలకు ప్రతిరూపం ఈ పాలిటెక్నిక్ కళాశాల అని, సివిల్, మెకానికల్ విభాగాలతో పాటు డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టేందుకు కృషిచేస్తానన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ను ఇక్కడకు తీసుకొచ్చి కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సుల ఏర్పాటుకు ప్రయత్నిస్తానన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇక్కడకు 14 ఏళ్ల క్రితమే తీసుకొచ్చేందుకు తీవ్రంగా కృషిచేశానన్నారు. వ్యాపార కేంద్రంగా ఉన్న తాడేపల్లిగూడెంను విద్యాహబ్‌గా తీర్చిదిద్దడంలో నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి నేడు సీఎం జగన్ కృషి ఎంతో ఉందన్నారు.



పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆఫర్ లెటర్లు ఇస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి

విద్యకు అధిక ప్రాధాన్యం

కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని, ఉద్యానవర్సిటీ, నిట్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో జిల్లాలో తాడేపల్లిగూడెం విద్యాప్రమాణాలకు టవర్‌లా నిలిచిందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తోందన్నారు.

క్రమశిక్షణ, కష్టపడేతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. భీమవరం ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం వ్యాపార రంగం నుంచి నేడు విద్యాపరంగా అభివృద్ధి చెందిందన్నారు. మరిన్ని విద్యాసంస్థలు ఇక్కడకు వచ్చే అవకాశం ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పునుకుమాటి శేషులత, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ముప్పిడి సంపత్‌కుమార్, పత్సమట్ల సావిత్రి, కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో చదివి పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు ఆఫర్ లెటర్లను మంత్రి కొట్టు సత్యనారాయణ చేతులమీదుగా అందించారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్) : స్పందనకు వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. భూసమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్, భూ తగాదాలు, వ్యక్తిగత తదితర సమస్యలపై 72 వినతులు అందినట్టు చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, జీఎస్‌డబ్ల్యూఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోండి

వాతావరణం శాఖ సూచనలు అనుసరించి రానున్న మూడు రోజులు ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని, రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని జేసీ రామసుందర్‌రెడ్డి సూచించారు. జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా పలుచోట్ల పంట కోత దశకు చేరుకుందన్నారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు మండలాల్లో 90 శాతం మేర కోతలు పూర్తికాగా.. మిగిలిన చోట్ల 50 శాతం కోతలు పూర్తయ్యాయన్నారు. ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్నివిధాలా ఆదుకుంటామని అన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, వీఆర్వో బృందంగా ధాన్యం కొనుగోళ్లలో సహాయంగా ఉంటారన్నారు. రైతుల వద్ద నుంచి తీసుకున్న గోనె సంచుకు రూ.3.38 పైసలు అద్దె చెల్లించడంతో పాటు వాటిని మళ్లీ రైతులకు తిరిగి ఇస్తామన్నారు. ఆర్బీకే సిబ్బంది త్వరితగతిన రైతుల నుంచి ధాన్యం సేకరించి రైసు మిల్లులకు పంపేలా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు.



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

నేత్రపర్వం.. ధ్వజారోహణం

ద్వారకాతిరుమల : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చరాచర సృష్టిని ఆహ్వానిస్తూ.. సోమవారం రాత్రి నిర్వహించిన ధ్వజారోహణ వేడుక భక్తకోటికి నేత్రపర్వమైంది. వైఖానస ఆగమోక్తంగా ఇంద్రాది అష్ట దిక్పాలకులను, భేరీ దేవతలను, గంధర్వ, కిన్నెర, కింపురుషాది దేవగణాలను, సప్త అధోలోక జీవులను స్వాగతిస్తూ.. లాంఛనంగా వేద మంత్రోచ్ఛరణలతో ఆలయ ధ్వజస్తంభంపై అర్చకులు గరుడ పటాన్ని ఎగురవేశారు. అంతక ముందు రుత్విగ్వరణ, మృద్గ్రహణ నిర్వహించిన అర్చకులు పుట్టమన్నును, నవ ధాన్యాలను తెచ్చి ఆలయ యాగశాలలో ఏర్పాటు చేసిన పాలికల్లో శాస్త్రోక్తంగా పోసి అంకురార్పణ జరిపారు. అనంతరం చినవెంకన్న బ్రహ్మోత్సవాల వీక్షణకు సర్వదేవతలను ఆహ్వానించే దిశగా ధ్వజారోహణను నిర్వహించారు. గరుడ ప్రసాదాన్ని భక్తులకు, సంతానం లేని మహిళలకు అందించారు. రాత్రి నిర్వహించాల్సిన హంస వాహనంపై స్వామి వారి తిరువీధి సేవ ప్రతికూల వాతావరణంతో వాయిదా పడింది. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు కాళీయ మర్దనం అలంకారంలో దర్శనమిచ్చారు.



కాళీయ మర్దన అలంకరణలో శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి భక్తిరంజని
- సాయంత్రం 4 గంటల నుంచి భరత నాట్య ప్రదర్శనలు
- సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనాలు
- రాత్రి 7 గంటల నుంచి భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- రాత్రి 8 గంటల నుంచి కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : శ్రీరామ శివ ధనుర్భంగం





ధ్వజ పటానికి హారతులిస్తున్న ఆలయ ప్రధానార్చకులు, భక్తులకు ధ్వజప్రసాదాన్ని అందిస్తున్న దృశ్యం

ఈకేవైసీ తప్పనిసరి

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్ర ఆర్థిక శాఖ ఇచ్చిన జీఓ నం.7 ప్రకారం ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగ పెన్షనర్లు విధిగా ఈకేవైసీ సంబంధిత ఉపఖజానా కార్యాలయాల ద్వారా లేదా మొబైల్ ఆధార్ అప్లికేషన్ ద్వారా త్వరితగతిన నమోదు చేసుకోవాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి అదారి గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి విశ్రాంతి ఉద్యోగ పెన్షనర్, ఉద్యోగి సీఎఫ్ఎంఎస్ ఐడీకి తన ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఫోన్ నంబర్, ప్రస్తుత నివాస అడ్రస్‌ను విధిగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అప్పటి ఫోన్ నంబర్ అందుబాటులో లేకపోతే ప్రస్తుత నంబర్‌ను ఆధార్‌కు లింకు చేసుకుని ఈకేవైసీని క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు భీమవరం–63026 18446, ఆకివీడు–95050 53723, నరసాపురం–73868 59749, పాలకొల్లు–95050 39748, పెనుగొండ–99516 02137, తాడేపల్లిగూడెం–94918 21365, తణుకు–83412 25044 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చదువుతోనే బంగారు భవిత

ఏలూరు(మెట్రో): పిల్లల భవిష్యత్ బాగుండాలంటే చదువు ఒక్కటే మార్గమనే వాస్తవాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజెప్పి బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా కృషి చేయాలని విద్యాశాఖాధికారులను ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే అంశంతోపాటు నాడు నేడు, పాఠశాలల్లో వాచ్‌మెన్‌ల నియామకం, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో బడి బయట ఉన్న 915 మంది పిల్లలను గుర్తించారని, వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యా ప్రగతిపై జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపరచడంలో విఫలమైన లెక్చరర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఇంటర్మీడియట్ పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆర్ఐఓ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆమె సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు మోడల్ పేపర్లు అందించడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 1,028 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 890 మంది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఈ మేరకు ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి జిల్లాలోని 87 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు గుర్తింపు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్నాయన్నారు. నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నది లేనిది తనిఖీ చేసిన అనంతరమే రెన్యూవల్ చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ ఆర్ఐఓ కె.చంద్రశేఖర్ బాబు, డీవీఈఓ కేవీ సత్యనారాయణ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శోభారాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌కు ప్రతిపాదనలు

నూజివీడు: నూజివీడులో రూ.5 కోట్లతో ఏర్పాటు చేయనున్న మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌కు మార్కెట్‌యార్డు ఆవరణలో స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయంలో సోమవారం మార్కెటింగ్ శాఖ విజయవాడ ఆర్‌జేడీ కె.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ డీపీఎం విజయకుమారి, ఏఎంసీ సెక్రటరీ యు.మహాలక్ష్మితో ఆయన సమావేశం నిర్వహించారు. మార్కెట్‌యార్డు ఆవరణలో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రూ.5 కోట్లలో 90 శాతం రాయితీ లభిస్తుందని, స్వయం సహాయక సంఘాల మహిళలు తమ కంట్రిబ్యూషన్ కింద రూ.50 లక్షలు సమకూరిస్తే సరిపోతుందన్నారు. ఈ యూనిట్ ద్వారా నూజివీడు నియోజకవర్గంతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని మామిడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. స్థల కేటాయింపుపై డీఆర్‌డీఏ, మార్కెటింగ్‌శాఖ అధికారులు సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. యూనిట్‌లో మామిడి పౌడర్‌ను తయారు చేసి ఎగుమతి చేయడం ద్వారా రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు లాభసాటిగా ఉంటుందన్నారు. తాను వ్యవసాయశాఖ మంత్రితో కూడా మాట్లాడి త్వరితగతిన మంజూరయ్యేలా చూస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు శీలం రాము, పోలిమెట్ల శివ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

క్లుప్తంగా

ఉత్తమ ప్రదర్శనగా 'నాన్నా.. నేనొచ్చేస్తా' నాటిక



నాన్నా..నేనొచ్చేస్తా నాటిక బృందానికి నగదు, షీల్డ్ అందజేస్తున్న దృశ్యం

యలమంచిలి: కొంతేరులో శ్రీపులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన నాటిక పోటీలలో రెండో రోజు ప్రదర్శించిన నాన్నా.. నేనొచ్చేస్తా నాటిక ఉత్తమ ప్రదర్శనగా మొదటి బహుమతి గెలుచుకుంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరి వారి ప్రేమతో నాన్న, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కళాంజలి హైదరాబాద్ వారి రైతే రాజు నిలిచాయి. విజేతలకు యూత్ కమిటీ అధ్యక్షులు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జీఎస్ ప్రసాదరెడ్డి పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ రేపూరి సూర్యనారాయణ బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు కొంతేటి సర్వేశలింగం, కత్తుల రామమోహనరావు, గంటా రామమోహనరావు గుణ నిర్ణేతలుగా వ్యవహరించారు.

లారీ డ్రైవర్ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- డ్రైవర్‌ను హత్య చేసి కోడిగుడ్ల లోడు లారీ అపహరణ
- గుడ్లు అమ్మి పంచుకున్న పది మంది నిందితులు
- పరారీలో ఆరుగురు.. లారీ, రూ.3 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రవిప్రకాష్



తణుకులో కేసు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

తణుకు: సినీ ఫక్కీలో లారీ డ్రైవర్‌ను హత్య చేసి మృతదేహాన్ని సైతం మాయం చేసి ఎనిమిది నెలల పాటు తప్పించుకుని తిరుగుతున్న ముఠా సభ్యులు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. కోడిగుడ్ల లోడు లారీని అపహరించి కోడిగుడ్లను అమ్ముకుని డబ్బులు సంపాదించాలనే పథకం వేసిన పది మంది నిందితుల్లో ముగ్గురు వ్యక్తులను సోమవారం తణుకు పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తణుకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ యు.రవిప్రకాష్ వివరాలు వెల్లడించారు. తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన కడలి వెంకటేశ్వరరావు (45) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది ఆగస్టు 12న కోడిగుడ్ల లోడుతో లారీ బయల్దేరింది. వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన వానపల్లి శివరాంప్రసాద్, విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం తగరపువలస గ్రామానికి చెందిన చందక గణేష్ కలిసి ప్రయాణికుల్లా తణుకు సమీపంలో ఈ లారీ ఎక్కారు. అర్ధరాత్రి తుని దాటాక అనకాపల్లి సమీపంలో డ్రైవర్ వెంకటేశ్వరరావును లారీలోనే పొడిచి చంపి మృతదేహాన్ని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న శారదానది ఏలేరు కాల్వలో పడేశారు. శివరాంప్రసాద్, గణేష్ కలిసి కోడిగుడ్లను శ్రీకాకుళంలోని శంబనా శాంతారావు అలియాస్ అనిల్ ఇంటి వద్ద దించారు. అక్కడి నుంచి లారీని పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం వోని గ్రామానికి చెందిన నిమ్మక సింహాచలం, కనపాక నవీన్, కనపాక ప్రవీణ్ సాయంతో ఒడిశా రాష్ట్రంలోని కుర్ధా టోల్‌గేట్ వద్ద వదిలేసి అక్కడే డ్రైవర్ సెల్ ఫోన్ ఉంచి తిరిగి వచ్చేశారు. రెండ్రోజుల తర్వాత వీరంతా కలిసి సామంతుల విశ్వేశ్వరరావు, అమర్ సాయంతో కోడిగుడ్లు అమ్మగా వచ్చిన రూ.10 లక్షలను అంతా కలిసి పంచుకున్నారు. ఇదే సమయంలో రూ.2 లక్షలను శివరాంప్రసాద్ భార్య దుర్గాభవాని బ్యాంకు అక్కౌంట్‌లో వేశాడు.

నిందితులను పట్టిచ్చిన సెల్‌ఫోన్ సిగ్నల్స్

ఇదిలా ఉంటే లారీ గమ్యస్థానం చేరకపోవడంతో వెంకటేశ్వర ఎగ్ ట్రేడర్స్ యజమాని వెంకటేశ్వరరావు 2022 ఆగస్టు 16న తణుకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్ వెంకటేశ్వరరావు నంబర్‌కు ఫోన్ చేసిన పోలీసులకు లారీ వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీయడంతో ఆరా తీశారు. దీంతో లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు డ్రైవర్ వెంకటేశ్వరరావు కోడిగుడ్లు లోడు అమ్మేసుకుని పరారయ్యాడని తొలుత భావించారు. అయితే అటు పోలీసులు, ఇటు డ్రైవర్ కుటుంబ సభ్యులకు అనుమానం రాకుండా వెంకటేశ్వరరావు భార్య నంబర్‌కు కొందరితో ఫోన్లు చేయిస్తున్న శివరాంప్రసాద్ మీ భర్త అక్కడ ఉన్నాడు.. ఇక్కడ ఉన్నాడని నమ్మించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అప్పటికే నెల ముందు చేపల లోడుతో ఉన్న లారీని అపహరించిన శివరాంప్రసాద్, గణేష్ చేపల లోడును విక్రయించి లారీని కోల్‌కత్తా సమీపంలో కాలికట్ వద్ద లోయలో పడేసి డీజిల్ పోసి తగలబెట్టారు. దీనిపై అక్కడి పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు శివరాంప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా డ్రైవర్ వెంకటేశ్వరరావుతో ప్రయాణించిన వారి ఆచూకీ కోసం గాలించిన తణుకు పోలీసులు చందక గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం విషయం వెలుగు చూసింది. చందక గణేష్, తంగేటి బుల్లియ్య అలియాస్ రవి, నిమ్మక సింహాచలంను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు వానపల్లి శివరాంప్రసాద్ కాలికట్ జైలులో ఉండగా శంబనా శాంతారావు, కనపాక నవీన్, కనపాక ప్రవీణ్, సామంతుల విశ్వేశ్వరరావు, అమర్, శివరాంప్రసాద్ భార్య దుర్గాభవాని పరారీలో ఉన్నట్లు ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు. నిందితుల వద్ద లారీతోపాటు రూ. 3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సహకరించిన పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ ఏఎస్సై బి.పోలయ్యకాపు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎంవీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు టి.రవి, కె.గోవిందరావు, డి.వెలగేశ్వరరావులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో నరసాపురం డీఎస్పీ కె.మనోహరాచారి, తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ వైతాళికుడు.. మహాకవి శ్రీశ్రీ



చిన్నారులను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి దశ దిశ నిర్దేశించిన సాహితీ వైతాళికుడు మహాకవి శ్రీశ్రీ కృషి మరువలేమని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో సోమవారం నిర్వహించిన శ్రీశ్రీ 113వ జయంతి సభలో ప్రతాప్ మాట్లాడారు. పీడిత ప్రజల పక్షాన సాహిత్యాన్ని నిలిపిన శ్రీశ్రీ అజరామరుడన్నారు. లక్షలాది మంది కవులకు శ్రీశ్రీ రచనలు ఒక స్ఫూర్తిదాయకం అన్నారు. అరసం, విరసం వేదికలకు నాయకత్వం వహించి కవులను శ్రీశ్రీ జాగృత పరిచారని పేర్కొన్నారు. ప్రతాప్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. సభకు తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షులు కోపల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఆళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్య పోటీలు అలరించాయి.. చిన్నారులకు పురస్కారాలు అందజేశారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, బీవీఆర్ వ్యవస్థాపకలు బుద్దాల వెంకట రామారావు, పైలు శ్రీనివాసరావు, గరికపాటి బాపయ్య శర్మ, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, కూనిరెడ్డి శ్రీనివాస్, జంధ్యాల నాగేశ్వరరావు, పీటీ వెంకన్న, కవురు శారద, మహాశివభట్టు లక్ష్మణరాజు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

దెందులూరు: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై వీర్రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముప్పవరం వద్ద హైవేపై 55 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఆకుపచ్చ గడుల టవల్, నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలిసిన వారు 94407 96654 నంబర్‌కు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



మంత్రి కారుమూరిని సన్మానిస్తున్న యాదవ సంఘం సభ్యులు



శ్రీకృష్ణ విగ్రహప్రతిష్టలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. గణపవరం వైఎస్సార్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల సందర్భంగా సోమవారం జరిగిన పూజా కార్యక్రమాలలో మంత్రి కారుమూరి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, దాతలు కూడా తమవంతు సహకారం అందించి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. శ్రీకృష్ణ ఆలయం నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరిని, ఎమ్మెల్యే వాసుబాబు, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిలను వేద మంత్రోచ్చారణల మధ్య యాదవ సంఘం సభ్యులు సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గణపవరంలో ఎప్పటినుంచో శ్రీకృష్ణ ఆలయం నిర్మించాలని చేస్తున్న కృషి ఇప్పటికి నెరవేరిందన్నారు. యాదవ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బి.మాల్యాద్రి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు సహకారం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు రాము, నాయకులు కాకర్ల శ్రీను, కొండేటి వెంకటరత్నం, అడపా త్రినాద్, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, నిడమర్రు మాజీ ఎంపీపీ కొండా సంగయ్య పాల్గొన్నారు.

వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలి



అత్తిలిలో వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ రవిప్రకాష్

అత్తిలి: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ హితవు పలికారు. సోమవారం సాయంత్రం అత్తిలి పాలూరు డ్యాం వద్ద ఎస్సై కేసీహెచ్ స్వామి హెల్మెట్ ఆవశ్యకతపై ద్విచక్రవాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈమార్గంలో వెళుతున్న ఎస్పీ రవిప్రకాష్ ఆగి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగించే సమయంలో హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులను ఎస్సై స్వామి ఆపి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే మేలును వివరించి, వాటిని ధరించే విధంగా కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

నాటిక పోటీల విజేత 'కొత్త పరిమళం'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలో చైతన్యభారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించిన 16వ జాతీయ స్థాయి సాంఘిక నాటికల పోటీల్లో కొత్త పరిమళం నాటిక ప్రథమ బహుమతి, వెండి అంచులు నాటిక ద్వితీయ బహుమతి, ప్రేమతో నాన్న నాటిక తృతీయ బహుమతి గెల్చుకున్నాయి. విజేతల వివరాలను సోమవారం నాటక పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామ్‌కుమార్‌రాజు విలేకర్లకు వెల్లడించారు. జ్యూరీ ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కత్రిపాడు వారి ప్రక్షాళన, పందు క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు ఎంపికయ్యాయన్నారు. ఉత్తమ రచయితగా వెండి అంచులు నాటికకు వల్లూరు శివప్రసాద్, ఉత్తమ దర్శకునిగా కొత్తపరిమళం నాటికకు బీఎంఎస్ పట్నాయక్, ఉత్తమ నటుడిగా ప్రేమతో నాన్న నాటికలో శశిధర్ పాత్రధారి సీవీఆర్ మూర్తి, ఉత్తమ నటిగా పక్షాళన నాటికలో ఎస్.అమృత వర్షిణి, ఉత్తమ ప్రతినాయకుడిగా కొత్తపరిమళం నాటికలో బి.చలం, ఉత్తమ హాస్యనటుడిగా పక్కంటి మొగుడు నాటికలో యూవీ శేషారావు, ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా కొత్తతరం కొడుకులు నాటికలో ఉమా శంకర్, ఉత్తమ క్యారెక్టర్ నటిగా మృత్యుపత్రం నాటికలో వై.భవానీ, ఉత్తమ సంగీత దర్శకుడిగా లీలామోహన్ గెల్చుకున్నారన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా మానాపురం సత్యనారాయణ, పీటీ మాధవ్, నుసుము నాగభూషణం వ్యవహరించారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందచేశారు. రాయప్రోలు శ్రీనివాసమూర్తి, కాగిత వెంకటరమణారావు, కత్రెడ్డి సత్యనారాయణ, భట్టిప్రోలు శ్రీనివాస్, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, పెన్నాడ శ్రీను, కొండేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముసునూరు: గోపవరంలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మరీదు రంగారావు (52) అదే గ్రామంలోని దళితవాడకు చెందిన సూదులకంటి కుమారి ఇంటికి తరచుగా వెళుతూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి కూడా వెళ్లాడు. అక్కడ ఇంట్లో ట్యూబ్ లైటు వెలగడం లేదని చూడమని ఆ ఇంట్లోని వారు కోరగా లైటును పట్టుకుని చూస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు అతని భార్యకు కబురు చేశారు. భార్య వచ్చి చూసే సరికే విగత జీవుడై పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం



ఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

దెందులూరు: గోపన్నపాలెం పీఈటీ కళాశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై ఐ.వీర్రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వైపు గుంటూరు జిల్లాకు చెందిన గుర్తు తెలియని యువకుడు ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. పీఈటీ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వైపు వేగంగా వెళుతున్న వ్యాన్ ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తణుకు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి సోమవారం మృతి చెందారు. తణుకు మండలం కొమరవరం గ్రామానికి చెందిన జిల్లెల భీమరాజు (35) గత నెల 24న మోటారు సైకిల్‌పై వెళుతుండగా స్థానిక కొమరవరం రోడ్డులో ఎదురుగా వచ్చిన మరో మోటారుసైకిలిస్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భీమరాజును చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



అత్తిలిలో వివిధ రకాల పూలతో ప్రత్యేక ఆలకరణలో వెంకటేశ్వరస్వామి

అత్తిలి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో వేంచేసియున్న బాలాజీ వెంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. అత్తిలి గ్రామానికి చెందిన జవ్వాది సుబ్బారావు, కోటేశ్వరి దంపతులచే స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీవెంకటేష్ ఆధ్వర్యంలో కల్యాణ తంతు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి తీర్థ మహోత్సవం ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు.

ముత్యాలమ్మకు పావుకిలో వెండి బహూకరణ



తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబాపురం ముత్యాలమ్మ చీరకు వెండిని అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ చీర నిమిత్తం విశాఖపట్నానికి చెందిన కొమ్మిశెట్టి పార్థసారథి దంపతులు పావు కిలో వెండిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటి తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

గూడెం కమిషనర్‌గా శ్రీనివాసచైతన్య



ఏ.శ్రీనివాస్ చైతన్య

తాడేపల్లిగూడెం: పట్టణ పురపాలక సంఘ కమిషనర్‌గా (ఎఫ్ఏసీ)ఏ. శ్రీనివాసచైతన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన బి.బాలస్వామి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ వైస్‌చైర్మన్‌గా బదిలీ అయ్యారు. మునిసిపాలిటీలోని పట్టణ ప్రణాళికా విభాగంలో అసిస్టెంటు సిటీప్లానర్(ఏసీపీ)గా పనిచేస్తున్న శ్రీనివాసచైతన్యకు కమిషనర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) అప్పగిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సీడీఎంఏ కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలను శ్రీనివాసచైతన్య స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఎంఈ.మురళీకృష్ణ, మేనేజర్ కుమారి, పట్టణ సర్వేయర్ రౌతు రామకృష్ణ, సీవస్ శ్రావణి, బి.శ్రీను మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి తిరు కల్యాణోత్సవం



వేల్పూరులో వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేల్పూరు గ్రామానికి చెందిన చుండ్రు నవీన్ కుమార్, రమ్య సుస్మిత దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి తిరు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుణ్ణం రంగారావు, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు శేషకుమారి, రెడ్డి హైమా, చుండ్రు శ్యామల, విజయ దుర్గ, వెంకట దుర్గ, నున్న దుర్గా ప్రసాద్, రెడ్డి సత్తిరావు, సుబ్రహ్మణ్యం, రమణమూర్తి, కాశీ, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

సాక్షి, భీమవరం : క్రీడల ద్వారా యువత ఆత్మస్థైర్యాన్ని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే ఫుట్‌బాల్ లీగ్ పోటీలను సోమవారం టాస్ వేసి ప్రారంభించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ఆరు టీములు పాల్గొంటాయన్నారు.

సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి

వాడవాడలా మే డే వేడుకలు



అత్తిలిలో మే డే వేడుకల్లో పాల్గొన్న సీపీఎం, సీఐటీయూ నాయకులు



తణుకు పట్టణంలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులు నిర్వహించిన ప్రదర్శన

తణుకు: మేడే ఉద్యమ పోరాట స్ఫూర్తితో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సోమవారం తణుకులో హోరున వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అరుణపతాకాలు ఆవిష్కరించి ప్రదర్శన చేపట్టారు. తొలుత సీపీఐ కార్యాలయం వద్ద భీమారావు మాట్లాడారు. దేశంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు తీరని ద్రోహం తలపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, నాయకులు తుమ్మల పల్లి శ్రీనివాస్, దాకే మసలయ్య, దేవ పెద్దిరాజు, అట్లు వెంకట్రావు, పెండ్యాల దత్తాత్రేయ ప్రసాద్, బొంగు శ్రీరామ్మూర్తి, రమణ, బోడపాటి నారాయణ, లక్ష్మి, పి.జ్యోతిబాబు, మందుల ముత్తయ్య, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

శ్రామికుల శ్రమను గౌరవించని వారి పాలనలో కార్మిక హక్కులకు రక్షణ ఉండదని వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం అన్నారు. సోమవారం స్థానిక అమర వీరుల భవనంలో జరిగిన మేడే సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మట్లాడారు. మోదీ ప్రభుత్వానికి అంబానీ, ఆదానీ బాగుంటే చాలని, ప్రజలు, కార్మికులు ఏమైనా పర్వాలేదన్నట్లుగా ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, పట్టణ అధ్యక్షుడు ఎన్.ఆదినారాయణ బాబు, కార్యదర్శి గుబ్బల గోపి, నాయకులు పీఎల్ నర్సింహారావు, వల్లూరి వెంకటేశ్వరరావు, అడివి నిర్మలాదేవి పాల్గొన్నారు.

అత్తిలి: ప్రపంచకార్మిక దినోత్సవం మేడే సందర్భంగా అత్తిలిలో సీపీఎం, సీఐటీయూ పతకాలను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మే డే ఊహాజనితంగా వచ్చిన రోజు కాదని, చరిత్రలో కార్మిక కర్షక, కష్టజీవుల బతుకు మార్పుకోసం జరిగిన చారిత్రక ఘట్టమని అన్నారు. ప్రపంచానికి ఎనిమిది గంటలు పనిదినంతో పాటు అనేక హక్కులు చట్టాలు తేవడానికి ఉపయోగపడిన ఆ ఘట్టమే మేడే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొట్ట అప్పారావు, మాంద్రు మాక సురేష్, సీఐటీయూ నాయకులు కె ధర్మేంద్ర, నేదుమూరి రమేష్, ఈపి శ్రీనివాస్, బాలం సత్యనారాయణ, పోలవరపు సత్యనారాయణ, వెంకటలక్ష్మి, శారద, మాధవి తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను మండలంలోని వేల్పూరు గ్రామంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం వేల్పూరు గ్రామంలోని మిని బైపాస్ రోడ్డులో గల భగత్ సింగ్ విగ్రహం వద్ద సీపీఎం స్థూపం వద్ద సీపీఎం పతాకాన్ని గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీర భద్రరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ఎర్ర మల్లికార్జునరావు, వి సుబ్బారావు, దున్నే నాగేశ్వరరావు, వాటాల నాగేశ్వరరావు, వీర భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో కార్మిక దినోత్సవం మేడేను సోమవారం నిర్వహించారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో మోదుగ గుంట, జగన్నాథపురం గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, యూనియన్ కార్యదర్శి పామర్తి జాన్ ఆచార్యులు, ఎన్.సత్తిపండు, సురేష్, రామారావు, వీర బాబు, కోటేశ్వరరావు, డి.వెంకట్రావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా మే డే దినోత్సవం జరిగింది. ఎస్.కే గ్రౌండ్ నుండు మే డే బహిరంగ సభ జరిగింది. పట్టణ అధ్యక్షుడు జవ్వాది శ్రీను అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా రాష్ట్ర నాయకులు కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల శ్రమ దోపిడి చేయడం ద్వారానే పెట్టుబడిదారులకు సంపద పెరుగుతుందని తెలిపారు. దేశాన్ని పరిపాలన చేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులు, చట్టాలపై దాడి చేస్తున్నారని విమర్శించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, మడక రాజు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, సత్తికోదండరామిరెడ్డి, గౌరైల సతీష్, కార్మికులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు సీహెచ్‌వీ రమణ, డిపో సెక్రటరీ కె.శ్రీనివాస్, గ్యారేజీ సెక్రటరీ ఎస్‌కే భాష, కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: ప్రభుత్వాలు కార్మికచట్టాలను తప్పక గౌరవించాలని మండల ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. మేడే పురస్కరించుకొని పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో పలు కార్మికసంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడు, ఆకుతీగపాడు, మీనవిల్లూరు, బిల్లగుంట, రాచర్ల గ్రామాల్లో మేడే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, కొణతాల నాగరాజు, దిద్దే నాగేశ్వరరావు, శేఖర్, పోతురాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు గేట్ సెంటర్‌లో సీఐటీయు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలు ప్రాంతాల్లో మేడే జెండాను ఎగురవేశారు. శిరపరపు రంగారావు, చిర్లపుల్లారెడ్డి, పెనగంటి దుర్గ, వడ్డి సత్యనారాయణ, సన్యాసిరావు పాల్గొన్నారు.



వేల్పూరులో మే డే ఉత్సవాలు నిర్వహిస్తున్న సీపీఎం నేతలు



తాడేపల్లిగూడెం మండలంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో మే డే సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు



గూడెంలో మే డే దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పెంటపాడు ఎస్టీవీఎన్ హిందూ హైస్కూల్లో మేడే వేడుకలు పురస్కరించుకొని ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఇరగవరంలో తడిసిన ధాన్యం రాసులు పరిశీలిస్తున్న అధికారులు

అత్తిలి: కురుస్తున్న అకాల వర్షాలకు పంట తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. సోమవారం ఆయన మండలంలో పలు గ్రామాలను సందర్శించి ధాన్యం రాసులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ అత్తిలి మండలంలో 50 శాతం వరికోతలు పూర్తయాయ్యని, 5,869 టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామని చెప్పారు.

ఇరగవరం: ఇటివల కురుస్తున్నా వర్షాలకు మండలంలోని దెబ్బతిన్న పొలాలను సోమవారం సివిల్ సప్లయ్స్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోతురాజు, మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్ర పరిశీలించారు. ఇరగవరం, రాపాకా , కావాలిపురం, అయినపర్రు, కొత్తపాడు, గ్రామాల్లో పర్యటించారు. కోతలు పూర్తి కానీ చేలను మూడు రోజులు వరకు కోతలు కోయించవద్దని, పడిపోయిన చేలను కట్టలు కట్టుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం రాసులు తడిసిన వారు మొలక రాకుండా ఉండటానికి 5శాతం ఉప్పు ద్రావణం లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ఆయా గ్రామాల్లోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: అకాల వర్షాల వల్ల రైతులు వరిపంటపై సరైన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి కోరారు. మరో రెండు రోజులు కోతలు కోయకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.

దోమల నివారణ అందరి బాధ్యత



కీటక జనిత నియంత్రణ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వై.వి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నివారణ అందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కీటక జనిత నియంత్రణ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు అర్బన్ హెల్త్ సెంటర్‌ల్లో జరిగాయి. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశాలత, చైతన్య, అమృత, శ్రావ్యలు పాల్గొని అవగాహన కల్పించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధ పాల్గొని మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.వ్యాధి నిరోధక టీకాలను షెడ్యూల్ ప్రకారం అర్హులైన పిల్లలందుకు అందించాలని, పలు సూచనలు చేశారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలన్నారు. ఆరోగ్య కార్యదర్శులు,ఆశా, సహాయకులు పాల్గొన్నారు.

అన్ని వృత్తుల వారికీ ప్రభుత్వం ప్రోత్సాహం

తణుకు టౌన్: అన్ని చేతి వృత్తుల వారికీ ప్రభుత్వం అండగా నిలిస్తుందని మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు చెప్పారు. సోమవారం సాయంత్రం తణుకు కార్పెంటర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వృత్తిల వారికీ రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా కార్పెంటర్లకు తణుకుకు చెందిన ఎస్‌వీ డోర్స్ అధినేత నరశింహారావు పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు పరిసర ప్రాంతాలకు చెందిన 250 మంది కార్పెంటర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హౌసింగ్‌బోర్డు సబ్‌స్టేషన్ పరిధిలో వన్ టౌన్‌లో 11కేవీ మెయిన్ రోడ్డు ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈనెల 2వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈ పీడీసీఎల్ గూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. వన్ టౌన్‌లోని మెయిన్ రోడ్డు ప్రాంతంలో షాపులు, టౌన్ పోలీస్‌స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, మునిసిపల్ ఆఫీస్ ఏరియా, శేషమహల్ రోడ్డు, బేబి సెంటర్ ఏరియా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దువ్వ దానేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న దానేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు. సోమవారం నుంచి శుక్రవారం నిర్వహించే జాతర ఉత్సవాల్లో ఈనెల 3వ తేదీన అమ్మవారిని వరిగేడు గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం , 4వ తేదీన దువ్వ గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహిస్తారని ఈవో సత్యనారాయణ తెలిపారు. 5వ తేదీన చండీ హోమం, అమ్మవారికి మహా కుంభ సమర్పణ జరుగుతుందని తెలిపారు. సోమవారం జరిగిన కలశ స్థాపన కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

గూడెంలో 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో సోమవారం ఉదయం 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వైకేవీ. అప్పారావు తెలిపారు. పెంటపాడు మండలంలో 28 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాబోయే మూడు రోజులు ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రభుత్వ పెన్షనర్లు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పెన్షనర్లు వెంటనే ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని ఉప ఖజానాధికారి పి.జయదత్తేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.హరికుమార్ విజ్ఞప్తి చేశారు. ఆధార్‌కార్డు, సెల్ ఫోన్, పెన్షన్ పుస్తకంతో పాటు సబ్ ట్రెజరీ అధికారి కార్యాలయానికి హాజరై ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని కోరారు. ఉపఖజానా కార్యాలయం నుంచి 3,000 పైగా పెన్షన్స్ పొందుతున్నారని, 1300 మంది ఈకేవైసీ చేయించుకున్నారని, 1700 మంది పెన్షన్ దారులు ఇంకా చేయించాల్సి ఉందన్నారు. వీరి కోసం ఉపఖజనా వారి కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈకేవైసీ చేయుటకు ముందుగా మొబైల్ నెంబర్‌కు ఆధార్ లింక్ తప్పనిసరిగా చేయాలన్నారు.

కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ శుద్ధ (మోహిని) ఏకాదశి సందర్భంగా పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ పరమాత్మకు సోమవారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేష అలంకరణలు గావించారు. సామూహిక భగవద్గీత పారాయణం భక్తులచే నిర్వహించారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

వరుణుడి దోబూచులాట


- భయపెడుతున్న తుపాను హెచ్చరికలు
- బెంబేలెత్తున్న రైతులు
- ధాన్యం కాపాడుకునేందుకు తంటాలు



మండపాకలో వర్షాల కారణంగా తడిసిన ధాన్యం రాసులను పరిశీలిస్తున్న జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, తదితరులు



దువ్వలో రోడ్డు మార్జిన్‌లో తడిసిన ధాన్యం రాసులు



తేతలిలో ధాన్యాన్ని బస్తాల్లో పడుతున్న రైతులు

తణుకు టౌన్: అకాల వర్షాలతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. పంట కాపాడుకోవడానికి రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. వాయుగుండం నేపథ్యంలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై గాలులు వీస్తున్నాయి. తణుకు నియోజకవర్గంలో పలు చోట్ల ఈదురు గాలులతో వర్షం కురిసింది. దాళ్వా వరి ధాన్యం మసూళ్ల సమయంలో కురిసిన అకాల వర్షాలకు అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సోమవారం కురిసిన వర్షాలకు కళ్లాలు, రోడ్ల మార్జిన్‌లలోని ధాన్యం రాసుల కిందకు వర్షం నీరు చేరి ధాన్యం తడిసిపోయినట్లు రైతులు తెలిపారు. వర్షపు నీరు బయటకు పంపేందుకు రైతులు చర్యలు చేపట్టారు. దీనితో పాటు ధాన్యం రాసుల చుట్టూ నీరు చేరకుండా ఉండేందుకు రాసులపై గడ్డి, బరకాలు, వేసి రక్షణ చర్యలు చేపట్టారు. కొంతమంది రైతులు రాసులలోని ధాన్యాన్ని బస్తాలుగా పట్టి గొడౌన్స్‌లకు తరలిస్తున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. తణుకు మండలంలోని తేతలి, దువ్వ, కోనాల, ముద్దాపురం, మండపాక గ్రామాల్లోని రైతులు అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

రైతులను ఆదుకుంటాం.

అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు రైతులకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం వర్షాల కారణంగా తడిసిపోయిన ధాన్యం రాసులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో తడిసిన ధాన్యం పరిస్థితుల గురించి మంత్రి కారుమూరికి వివరిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం రాసులను మండల వ్యవసాయాధికారి కేకుసుమ పరిశీలించారు.